# లవంగి

వేసవి కాలం శెలవులు అయ్యాయి. కాలేజీలు మళ్ళీ తెరిచారు. మార్చి నుంచి జూలై దాకా యీ నాలుగు నెలలూ కమలకు జైల్లో పెట్టినట్టు అన్పించింది. పగలంతా వేడి, రాత్రంతా ఉక్క, దీంతో నానా హైరానా అయిపోయింది. ఈ ఇబ్బందులన్నీ ఒక ఎత్తు, అంజిబాబు హడావిడీ ఒక ఎత్తు. అమ్మయ్య! ఊరుకు వెళ్ళిపోయాడు కాబట్టి ప్రాణం కుదుటపడ్డది. లేకపోతే తనకి పిచ్చెక్కినంత పని జరిగి నూతులో దూకుదామా, లేకపోతే ఉరి పోసుకుని ప్రాణం తీసుకుందామా అన్నంత చికాకు కూడా కలిగింది. బావ యిలా ఊరుకు వెళ్ళాడో లేదో కాని వడగాలి తగ్గి భారీ ఎత్తున వాన పడ్డది. దేశం చల్లబడ్డదని ఊళ్ళోవాళ్ళు అనుకున్నారు. మనస్సు చల్లబడిందని కమల అనుకున్నది.

"అమ్మాయికి కాలేజీ తెరుస్తున్నారు. బట్టలు కావాలి" అని అమ్మ నాన్నతో చెప్తున్నది.

ఆకుమళ్ళ ఊడ్పులు అంటూ వ్యవసాయం పనులలో మునిగి తేలుతున్న నాన్న అమ్మ మాట వినిపించుకోలేదు. అమ్మ మళ్ళీ హెచ్చరించింది.

నాన్న ఏం మాట్లాడకుండా అమ్మ చేతిలో రెండువందల రూపాయలు పెట్టి, "పుల్లయ్యను బాగు చెయ్యండి" అని అన్నాడు.

అమ్మ అక్కణ్ణించి కదల్లేదు. "రెండు వందలకు ఏమి వస్తాయి?" అని ఇంకొక సవాలు విసిరింది. అమ్మ చేతికి ఇంకొక వందరూపాయలు వచ్చాయి. అంతవరకూ బద్ధకంగా కూర్చున్న అమ్మ, అమ్మాయి కలిసి ఒక్క చిటికెలో ముస్తాబై రెండగల్లో బజార్లో పుల్లయ్య బట్టల దుకాణానికి చేరారు.

"పుల్లయ్య బట్టల దుకాణం...." అని అంటూ తను ఒక రోజున ఏదో చెప్పబోతూవుంటే అంజిబావ

"పుల్లయ్యగారి బట్టల దుకాణం అని అను" అంటూ సవరించాడు.

"ఏం ఎందుకనాలి" అని తను రెట్టించింది.

"పుల్లయ్యగారి సంగతి నీకు తెలియదు."

"పోనీ నీకు తెలిసిందేమిటో చెప్పు."

"ఈ ప్రాంతంలో అందరికన్నా ఎక్కువ ఇన్‌కమ్‌టాక్సు కట్టేది ఆయనే తెలుసా?"

"అయ్యో పాపం!"

"పాపమేమిటే! అంత వ్యాపారస్థుడు యీ ప్రాంతంలో ఎవరూ లేరనుకో! పైగా ఆయన మెహర్‌బాబా భక్తుడు. మంచివాడు."

"కనుక పుల్లయ్యగారి బట్టల దుకాణం అని అనమంటావు?"

"అవును."

"రేప్పొద్దున్న నిన్నుకూడా అంజి బావగారూ అని పిలవమంటావేమో."

"భర్తను బహువచనంతో పిలవటం మనకు మామూలేను!"

"ఇహ అంతటితో ఆపు" అంటూ కమల అక్కడనుంచి వెళ్ళిపోయింది.

ఫస్టున బియ్యే ప్యాసులయి ఎమ్మే చదువుతూ అందంగా పొడుగ్గా వుండే అంజిబావ అంటే అందరికీ యిష్టమే. అంతా అతన్నే మెచ్చుకునేవాళ్ళే. కాని ఎందువల్లనో కమలకు అంజిబావ అంటే వల్లమాలిన చికాకు. ఎవరితోనో ఒకసారి నాన్న తనకు వినబడేలాగా

"మా కమల పెళ్ళిని గురించి నాకే బెంగాలేదు. దాని చదువూ వాడి చదువూ కాగానే మా అంజిగాడికిచ్చి ముడిపెడతాను" అని అన్నాడు.

తను అంజిగాడి పెళ్ళాం!! ఇంత చదువూ చదివి ఇంత బ్రతుకూ బ్రతికి చివరకు అంజిబావనా పెళ్ళిచేసుకోవడం! ఈ ఆలోచన రాగానే నిలువెల్లా కారం రాసుకున్నట్టు తనకు వళ్ళంతా ఒక్కసారి భగ్గున మండింది.

సరాసరి వాళ్ళమ్మ దగ్గరకు వెళ్ళి, "నేను నూతిలో పడి చస్తా" అని అన్నది.

ఏదో పరధ్యానంలో ఉన్న అమ్మ "ఇవాళ కాదు రేపు" అని అన్నది.

"అమ్మా!" అని కమల కోపంగా అరిచింది.

అమ్మ ఉలిక్కిపడి, "ఏమిటే గావుకేకలు పెడుతున్నావు?" అని అడిగింది.

"నాన్న ఏమంటున్నాడో విన్నావా?"

"ఏమంటున్నారు? కాఫీలో పంచదార తక్కువయ్యిందంటున్నారా?"

"నన్ను అంజిబావకు యిస్తాడట."

"ఇందులో కొత్త విషయం ఏముంది?"

"నువ్వూ ఆ మాటే అంటే నూతిలో పడి చస్తా."

ఈసారి అమ్మకు నిజంగానే కోపం వచ్చి, "అప్రాచ్యపు కూతలు కూసావంటే పళ్ళు పళ్ళు రాలగొడతాను. నోరుమూసుకుని కందిపచ్చడి రుబ్బు" అని హుకుం యిచ్చింది.

కందిపచ్చడి అంటే తనకు ఎంతో యిష్టం. కందిపచ్చడి చేసిన రోజున అమ్మ ఉల్లిపాయ పులుసు కూడా చేస్తుంది. ఇంకేం! ఇప్పుడీ కందిపచ్చడి మాట వినగానే కమల కోపం మంచుతెరలాగా మాయమైంది.

"మా పొలంలో దిబ్బమీద కందుల్లాంటివి దేశంలో ఎక్కడా దొరకవు" అని నాన్న ఒలింపిక్స్‌లో గెలిచినంత గర్వంగా చెప్పుకుంటాడు.

అంతా ఆయన ఎదుట అవునంటారు. ఆయన లేనపుడు ఆ మాటలే చెప్పుకొని నవ్వుకుంటారు.

అంతకంటే కూడా అమ్మా నాన్నా వాళ్ళ విషయం తలుచుకుంటే తనకు యింకా నవ్వు వస్తుంది.

క్విట్ ఇండియా సత్యాగ్రహం రోజుల్లో అమ్మానాన్నా కాంగ్రెస్ వాలంటీర్లుట. బ్రిటిష్ వారు భారతదేశం నుండి వైదొలగటానికి కాంగ్రెస్ జరిపిన సమరంలో వీళ్ళిద్దరూ కూడా పాల్గొన్నారు. ఒకసారి పోలీసు లాఠీచార్జిలో నాన్నకు దెబ్బలు తగిలాయట. అప్పుడొక స్వచ్ఛంద సేవిక ఆయనకు ఉపచారం చేసిందట. ఆ సంఘటనే వారి ప్రణయ జీవితానికి నాంది అని వారికి ఆనాడు తెలియదు.

దేశంలో కొన్ని రోజులకు ఉద్రేకం, అలజడి తగ్గినా, ఈ ఉద్యమంలో కలుసుకున్న వీళ్ళ యిద్దరి మనస్సులోని అలజడి ఆనాటికానాడు అంతకు యింతైందట. దాంతో తాతయ్యలిద్దరు కూడబలుక్కుని అమ్మకూ నాన్నకూ పెళ్ళి చేశారట. వాళ్ళ నోములపంటే కమలట.

నాన్న యీనాటికీ కాంగ్రెసే. కాని అమ్మ మాత్రం మధ్య మధ్య స్వతంత్ర పార్టీ మనిషిలాగా మాట్లాడుతుంది.

అన్ని విషయాలలో లాగానే అంజిబావ విషయంలో కూడా అమ్మకూ, నాన్నకూ మధ్య కొన్ని ఓట్ల తేడాలో అభిప్రాయ భేదం ఉంది. సాధారణంగా నాన్నకు మెజారిటీ వచ్చినా అమ్మ మాత్రం నాన్న తనకు పెళ్ళినాడు యిచ్చిన 'వీటో' అధికారం ఉపయోగించి నెగ్గుకు వస్తుంది. ఆ 'వీటో' లేకపోతే తనూ, అమ్మా యీపాటికి ఏమైపోయేవాళ్ళో!

ఆయన మాటే నెగ్గి ఉంటే తనూ, అమ్మా నలభై నెంబరు ఖద్దరు చీరెలు కట్టుకుని రోజూ రాట్నం వడుకుతూ కాలం గడపవలసి వచ్చేది. అమ్మ ధర్మమే

అని అటువంటి ఆపద తప్పింది. తనే కాదు, నాన్న కూడా యీనాడు టెర్లిన్ షర్టులు తొడుక్కుంటున్నాడు.

"అమ్మాయ్ పచ్చడి" అంటూ అమ్మ పొలికేక పెట్టింది. కమల ఉలిక్కిపడి అమ్మ వంక చూసింది. అమ్మ తనవంక అరక్షణంలో అరవైఆరో వంతు కోపంగా చూసినా వెంటనే నవ్వింది.

"ఏమిటే ఆ పరధ్యానం?" అని అడిగింది.

పుల్లయ్య... సారీ, పుల్లయ్యగారి బట్టల దుకాణానికి కమలకు బట్టలు కొనటానికి తల్లీ కూతురూ వెళ్ళారు. అమ్మ రెండు మంచి చీరలు కొనుకుంది. అమ్మాయి నాలుగు నైలెక్సు చీరలు కొనుక్కుంది. నాన్న యిచ్చిన మూడు వందలే కాకుండా యింకా రెండు వందల నాలుగురూపాయల డెబ్భైనయాపైసలు నాన్న పేర పద్దు పడ్డది. అప్పుడు అమ్మ జాలిపడి, నాన్నకు కూడా ఒక జరీ పంచెలచాపూ, ఒక సిల్కు షర్టూ కొన్నది.

ఎప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడు కొత్తబట్టలు కట్టుకుని కాలేజీకి వెడదామా అని కమల ఆ రాత్రంతా కలత నిద్దురలోనే గడిపింది. కాలేజీకి వెళ్ళాలి, తన బట్టలు జానకికి చూపించాలి. యిదే ఆలోచన, యిదే ఆలాపన. జానకికి తనంటే ప్రాణం. అది కాలేజీకి వచ్చిందంటే ఆ సరదాయే వేరు. అంత వుషారైన మనిషి మగవాళ్ళలో కూడా ఉండరేమోననిపిస్తుంది.

క్రిందటి సంవత్సరం యిలాగే ఒకసారి తను బాగా డ్రస్ చేసుకుని కాలేజీకి వెళ్ళింది. ఎవ్వరూ లేకుండా చూసి జానకి తనతో ఒక మాట అన్నది.

"నేనే మగవాడినైతే ఉన్నపాళంగా నిన్ను పెళ్ళి చేసుకునే దాన్ని."

"దేముడు ఉన్నాడు."

"ఏమిటే?"

"దేముడు ఉన్నాడు కాబట్టే అటువంటి ప్రమాదం రాకుండా తప్పిపోయింది. నిన్నే మగవాడిగా పుట్టించి ఉంటే, మళ్ళీ గోపాలకృష్ణుడు పుట్టాడు అనేవాళ్ళు.'

గోపాలు పేరు రాగానే యిద్దరూ ఫక్కున నవ్వారు. సుగుణమణి అన్నట్టు గోపాలంలాంటి వాడిని సృష్టించబట్టే బ్రహ్మదేముడికి పూజా పునస్కారం లేకుండా పోయింది.

ఆడపిల్లలు కూడా అంత బాగా సిగ్గుపడలేరు. ఎప్పుడూ తెల్లటి బట్టలు వేసుకుంటాడు. ముట్టుకుంటూ ఎక్కడ కందిపోతాడో అన్నట్టుగా ఒదిగి ఒదిగి భయపడుతూ బిత్తరపోతూ నడుస్తూ వుంటాడు. ఏ తప్పు చేయకపోయినా యీ

అమాయకుడిమీద అమ్మాయిలంతా కత్తికట్టారు. గోపాలానికి చిత్రాంగి అని పేరు పెట్టారు. గోపాలానికి కాలేజీ మొత్తంమీద పరిచయంగాని చదువుకాని వున్నదల్లా ఒకే ఒక వ్యక్తి. అది కాంతం. ఆ పిల్లని చూస్తే లెక్చరర్లకి భయం. (ప్రిన్సిపాలుకు బిడియం) ఇహ అబ్బాయిల సంగతి చెప్పనే అక్కర్లేదు. అమ్మాయిలని అల్లరి చెయ్యడంలో అంతర్జాతీయ ఖ్యాతిని పొందినవాళ్ళు కూడా యీ కన్యాకుమారిని చూడగానే తుండు తుపాకీ లేకుండా పారిపోయే వాళ్ళు. ఇందరూ యిన్నివిధాల భయపడటానికి, కాంతం ఏమన్నా కలకత్తా కాళి అవతారమా అని అనుకుంటే మాత్రం అది అక్షరాలా నూటికి నూటయిరవై పాళ్ళు అబద్ధం. అది అసలే అందాల రాశి. ఎప్పుడూ ముఖం ప్రసన్నంగా వుంటుంది. ఒక చక్కటి చిరునవ్వు చిందులాడు వుంటుంది. మామూలుగా అందరి ఆడపిల్లలలాగా అణుకువుగానే ఉండేది. కాని ఉన్నట్టుండి ఒకసారి కాంతం ఇంటర్నేషనల్ ఫేమ్ సంపాదించింది.

ఆ కథాక్రమం బెట్టిదన... కాలేజీలో రాంబాంబు అనే ఒక బక్కపలచటి బాలుడున్నాడు. ఈసారి ఎన్నికల్లో ప్రెసిడెంటుగా గెలిచి తీరాలని ఎమ్మెల్యే ఎలక్షనంత హడావిడితో ముందూ వెనకా చూడకుండా డబ్బు ఖర్చుకు లెక్క చెయ్యకుండా తన పలుకుబడి మొత్తం ఉపయోగించి యీ పదవే తన ముఖ్య ఆదర్శంగా, జీవిత లక్ష్యంగా పెట్టుకున్నాడు.

గెలిచేవాడే! తప్పకుండా గెలుస్తాడని అంతా అనుకున్నారు. ఎందుకంటే అతనికి ఆ అర్హతలున్నాయనే ఒక గట్టి నమ్మకం, చెక్కు చెదరని ధైర్యం ఉన్నాయి. కాలేజీ చదువు విషయం పట్టించుకోకపోవడం, జూనియర్ క్లాసు అమ్మాయిలని అల్లరి చెయ్యడం, ఏడిపించడం, పరీక్షల్లో కాపీ పట్టుకోవడానికి ప్రయత్నం చేసిన కొత్త లెక్చరర్‌ని కాలేజీ కాంపౌండులో దేహశుద్ధి చెయ్యడానికి శాయశక్తులా ప్రయత్నం చెయ్యడం వంటి 'వీరోచిత' కార్యాలు చూసిన పిమ్మట మరియు అతని నాన్నగారికి బయట సమాజంలో వున్న పొలిటికల్ పలుకుబడి చూచిన మీదట అందరూ అన్ని విధాలా బాగుందన్నారు. తండ్రి అడుగుజాడల్లో నడవటానికి ఇంతకంటే చక్కటి సదవకాశం వేరే ఏముందని 'పెద్దలంతా' ఏకగ్రీవంగా బాగుందన్నారు. మంచి రోజు చూచి రాంబాబు ప్రచారం మొదలు పెట్టాడు. అన్ని క్లాసుల్లోకి వెళ్ళి తన యోగ్యతలూ, అర్హతలూ వివరించి చెప్పి తనకే తమ అమూల్యమైన ఓటు యిచ్చి గెలిపించవలసిందని సవినయంగా అర్థిస్తున్నాడు. కాని, ఉపన్యాసం యిస్తున్నంతసేపు అతగాడి దృష్టి ఆడపిల్లల బల్ల వైపే ఉండటం, అందరూ, ఆడపిల్లలతో సహా గమనించకపోలేదు. కాంతం వాళ్ళ క్లాసులో కూడా యీ కాండ అంతా జరిగింది. సభికులకు నమస్కరించి రాంబాబు వెళ్ళబోతున్న సమయంలో పార్వతీదేవి లాగా ప్రసన్నవదనంతో కాంతం లేచి నిలబడింది. "నేను కూడా ఒక్క మాట

చెప్పవచ్చునా?'' అని అడిగింది. అంతా ఆశ్చర్యపడ్డారు. అందులో రాంబాబు ఆశ్చర్యం అంతా యింతా కాదు. కానీ అంతలోనే తెప్పరిల్లుకుని, లేని బింకం పుంజుకొని, "తప్పకుండా చెప్పండి'' అని అన్నాడు. చీమ చిటుక్కుమంటే వినిపించేటంత నిశ్శబ్దంగా వుంది. ఈ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వీణమీటినట్టు కాంతం కంఠం వినిపించింది.

"మనం చదువుకుని విద్యావంతులం, విజ్ఞానవంతులం కావటానికి కాలేజీకి వచ్చాం. బయట రాజకీయాల్లో వుండే కుళ్ళు, కల్మషం అంతా చూస్తూ వుండి కూడా యీ యూనియన్లు, ఎలక్షన్లు అంటూ కాలేజీ అధికారులు కాలేజీ విద్యార్థుల మనస్సులు ఎందుకు పాడుచేస్తారో తెలియదు. సంఘంలో వున్న అనేక దురాచారాల లాగానే యిది కూడా మనకు భరించక తప్పదు కాబోలు. కాబట్టి మనం మనల్ని గౌరవించి, మన గౌరవాన్ని నిలబెట్టగల వ్యక్తినే ప్రెసిడెంటుగా ఎన్నుకోమని నా ప్రార్థన.''

రాంబాబు ముఖంలో రంగులు మారాయి. క్లాసులో వాళ్ళంతా ఒక్కసారి పెద్ద పెట్టున చప్పట్లు కొట్టారు. చివరి బెంచీలో కూర్చున్న ఒక బుద్ధిమంతుడు "కాంతాదేవీ జిందాబాద్'' అని అరిచాడు. క్లాసులో ఆడా, మగా అంతా కలిసి "జిందాబాద్'' అని అరిచారు.

కాలేజీలో ఒక చిన్న క్లాసులో జరిగిన యీ విడ్డూరం ఊరూ, నాడూ వరదలాగా ఒక్కసారి ముంచేసింది. ఈ అలజడి, హడావిడీ తగ్గి జనం తెప్పరిల్లుకునే సరికి జరిగిన దేమిటయ్యా అంటే అది ఎలా జరిగిందో ఎవ్వరూ యీనాటికీ కూడా చెప్పలేరు. కాలేజీ పిల్లలంతా కలిసి కాంతానికి మహావీర చక్రం యిచ్చి పోటీ లేకుండా తమ యూనియన్‌కి ప్రెసిడెంటుగా ఎన్నుకున్నారు. సరే! వార్తా పత్రికలు ఊరుకుంటాయా? ఈ సమాచారం తగు మాత్రం పెద్ద అక్షరాలలో మొదటి పేజీ మూడవ కాలంలో వేశారు.

దాని ఫలితం ఏమిటయ్యా అంటే జీవితంలో ఎన్నడూ చెయ్యని మంచిపని ఒకటి రాంబాబు చేశాడు. టీ.సీ. తీసుకుని కాలేజీ వదిలి ఇంకొక కాలేజీకి వెళ్ళిపోయాడు. ఈ వెళ్ళడం కూడా రెండవ కంటివాడికి తెలియకుండా వెళ్ళిపోయాడు. శనివారం దాకా కాలేజీకి వచ్చిన రాంబాబు సోమవారం రాకపోయే సరికి అసలు సంగతి తెలిసిపోయేసరికి కాలేజీలో యావన్మంది కుర్రవాళ్ళు రెండు నిముషాలు మౌనం పాటించారు. అటువంటి మహనీయుడికి తగుమాత్రం సత్కారం చేసేసరికి సరైన వీడ్కోలు యివ్వలేకపోయామే అని విచారించారు.

కాని మూడునెలలు తిరక్కుండానే కాంతం పెళ్ళి జరిగింది. ఆ పెళ్ళి కూడా విచిత్రంగానే జరిగింది. కమలా వాళ్ళ దూరపు బంధువుల కుర్రవాడొకడు

కాంతం యూనియన్ ఎన్నికల ఉదంతం పేపర్లో చదివి ఆ పిల్ల ధైర్య స్థైర్యాలకు మెచ్చుకుని వరించివచ్చి కాంతాన్ని పెళ్ళిచేసుకున్నాడు. పెళ్ళి చేసుకోగానే కాంతం అన్నని, తల్లిని, తండ్రిని మరిచి మధ్యవచ్చిన మగనితో వారం తిరగకుండానే కాపరానికి వెళ్ళిపోయింది. వెడుతూ తన పుట్టినింటివారందరిని నెలతిరగకుండానే దాదాపుగా మరిచిపోయినా కమల మాత్రం కాంతాన్ని మరిచిపోలేదు.

ఒక్కొక్కప్పుడు చిరాకు కలిగినప్పుడు అంజిబావలాంటి మనిషిని భగవంతుడు ఎందుకు సృష్టిస్తాడా అని అనేకసార్లు తను విసుక్కుంది. కాని ఆయన చేసే ప్రతి పనికి ఒక ప్రత్యేకమైన ఉపయోగం వుంటుందని గ్రహించిననాడు తను పడ్డ సంతోషం అంతా యింతా కాదు.

ఆ రోజున తను కాలేజీనుంచి యింటికి వచ్చేసరికి సావిట్లో అతను కూర్చొని వున్నాడు. తెల్లటి షర్టు, పాంటు, నీలంరంగు టై వేసుకున్నాడు. అతనివంక ఒక్కక్షణం చూస్తూ అలా నిలబడిపోయింది. మరుక్షణంలో సిగ్గు నిలువెల్లా ముంచివేస్తే అక్కడ యిహ నిలబడలేకపోయింది.

అతను ఎవరు? మన యింటికి ఎందుకు వచ్చాడు? అని అడుగుదామని కమల ఎంతో అనుకుంది. తను అడగవలసిన అవుసరం లేకుండానే అంజిబావ అన్ని వివరాలు చెప్పాడు. కాలేజీలో అంజిబావ క్లాసుమేటుట. బి. ఎ. పూర్తి చేసుకుని వాళ్ళ నాన్నగారి బిజినెస్ మేనేజ్ చేసుకుంటున్నాడట. ఈ వూరులో-రెండుమూడు నెలలు వుంటాడట.

"కాపురం పెడతాడా?" అని అడిగింది.

"ఇంకా బ్రహ్మచారే! ఎవరో బంధువుల యింట్లో బస చేస్తున్నాడట." అతను బ్రహ్మచారి అని అంజిబావ చెప్పగానే తనకు ఎందుకనో కాని ఎంతో సంతోషం వేసింది. ఆ సంతోషంలో అంజిబావ అంటే కోపంకూడా తగ్గిపోయింది.

బావకు యిష్టమని ఆ రోజున తను స్వయంగా పరమాన్నం వండిపెట్టింది. బావ ముఖం విప్పారింది. తను డాబా మీద కూర్చొని వెన్నెల్లో చందమామ వంక చూస్తుంటే, బావ తన భుజాలు రెండు పుచ్చుకుని ముద్దు పెట్టుకోబోయాడు. మరుక్షణంలో బావ చెంప ఛెళ్లుమన్నది. ఒక్కక్షణం నివ్వెరపోయాడు. అంతలోనే చిన్నబుచ్చుకుని "ఐ యాం సారీ" అని అన్నాడు.

ఆరోజునుంచి తను అంజిబావకు చాలా దూరంగానే వుంది. సంధికోసమని అంజిబావ అనేక ప్రయత్నాలు చేశాడు. కాని ఎటు చూసినా అతనికి నిగ్రహమే ఎదురయింది. అమ్మకు నాన్నకూ యీ గొడవ తెలియదు. తెలిసిందంటే ఏ విషయంలో ఏకీభవించినా ఏకీభవించలేకపోయినా ఈ విషయంలో మాత్రం ఏకైక

అభిప్రాయానికి వచ్చేవారు. అంజిబావ యిప్పట్లో యీ యింట్లో అడుగు పెట్టడానికి ఆస్కారం వుండేదికాదు. మొట్ట మొదట్లో అమ్మతో నాన్నతో యీ విషయం చెబుదామన్నంత కోపంవచ్చినా రవ్వంతసేపు ఆలోచించేసరికి తనకే జాలివేసింది. తన అందం చూసి బావ మెచ్చుకోబోయాడు. తెలివితక్కువవాడు కాబట్టి మోటుగా ప్రవర్తించాడు. ఏమైతేనేం అటువంటివాడికి దూరంగా వుండటమే తనకు శ్రేయస్సు. తన దగ్గర రహస్యంగా క్షమార్పణ చెప్పుకోవడానికి బావ శతవిధాల ప్రయత్నం చేశాడు. కాని తను అవకాశం ఎక్కడా యివ్వలేదు.

అందుకనే వేసవికాలమంతా దాగుడుమూతలు ఆడటంతో సరిపోయింది.

రామం కనబడ్డ పది రోజులదాకా కాంతంతో యీ విషయం చెబుదామని శతవిధాల ప్రయత్నం చేసింది కాని కాలేజీలో ఒంటరిగా ఒక్కక్షణం కూడా అవకాశం దొరకలేదు. కాలేజీలో అయితే యిహ లాభంలేదని సరాసరి బయలుదేరి కాంతం వాళ్ళ యింటికి వెళ్ళింది. ఇంట్లో అడుగుపెట్టి ముందు సావిట్లో ఆగిపోయింది. తన కళ్ళని తాను నమ్మలేకపోయింది. ఎందుకంటే సావిట్లో పడక కుర్చీలో ఒక బెంగాలీ బాబు కూర్చొని చదువుకుంటున్నాడు. అతను 'అతనే!' అడుగు ముందుకు సాగలేదు. మనస్సు తొట్రుపాటు పడింది. ఆ అలజడికి చేతులకు వేసుకున్న గాజులు గలగల మన్నాయి. బ్రహ్మచారి తలఎత్తి తన వంక చూశాడు. ఒక్కసారి ఉలిక్కి పడ్డాడు. నిన్ను ఎక్కడో చూశాను! ఎక్కడ చూశానబ్బా! ఆ కళ్ళు, కనుబొమ్మలు క్షణంలో ఎన్నో పరంపరలు కురిపించాయి. తను సిగ్గుతో త్రిభంగిగా నిలచిపోయింది. అప్రయత్నంగా తన నోటివెంట 'కాంతం' అన్న మాట వెలువడింది.

అంజిబావ స్నేహితుడు కుర్చీలోంచి లేచాడు.

"కూర్చోండి" అంటూ తనని ఆహ్వానించాడు.

తను ఎప్పుడూ చనువుగా వెళ్ళే ఇల్లే అయినా పరాయిదానిలాగా అతను చూపించిన కుర్చీలో కూర్చుంది.

"కాంతం గుళ్లోకి వెళ్ళింది. ఇప్పుడే వస్తుంది కూర్చోండి" అని అతను అన్నాడు.

కమల ఏం మాట్లాడలేదు.

"మిమ్మల్ని ఆంజనేయులుగారింట్లో చూసినట్టు గుర్తు" అని అన్నాడు.

"అతను మా అత్తయ్య కొడుకు."

"కాంతం మీ క్లాసుమేటా?"

"అవునండీ."

ఈ సంభాషణ ఇలా ఎల్లకాలం జరుగుతునే వుండాలని కమల మనసులో కోరుకుంది.

కాని వంటయింట్లో ఏదో చప్పుడైతే అతను లోపలికి వెళ్లాడు. వెళ్ళి ఎవరితోనో, "నీ కోసం ఒక 'లవంగి' వచ్చింది" అని అన్నాడు. ఆ మాటలు కమల చెవిన పడ్డాయి. 'లవంగి' ఇదేం పేరు? కాని అంతలోనే అసలు విషయం గుర్తుకు వచ్చింది. లవంగి అపురూప సౌందర్యరాశి. జగన్నాధ పండితరాయలుచే వలి వలపించుకున్న మొగలాయి రాజపుత్రి. తను అందగత్తెనని యీ కాంప్లిమెంటు ఇస్తున్నాడేమో! ఈ ప్రశ్నలకి సమాధానం వచ్చేలోపలే కాంతం తన ఎదుట ప్రత్యక్షమైంది. "ఇక్కడ కూర్చున్నావేం?" అని అడిగింది.

"ఆయన ఎవరో ఇక్కడ కూర్చోమని హుకుం యిచ్చారు. ఎవరే ఆయన..."

"మా రామం అన్నయ్య."

"అన్నయ్య!" ఆ మాటతో కమలకు కొండంత బరువు తీరినట్టు అనిపించింది. 'అమ్మయ్య' అని అనుకున్నది.

ఆ మాటా యీ మాటా చెప్పుకుంటూ కమల కాంతం వాళ్ళ యింటిదగ్గర రవ్వంత పొద్దుపోయేదాకనే గడిపింది. వద్దనుకుంటూనే కమల కళ్ళు అతని కోసం ఇల్లంతా గాలించి వేశాయి. ఆ బాలకుమారుడు కంటపడితేనా? కాంతాన్ని వదిలి ఆరోజున యింటికి వస్తుంటే నిజంగానే బాధ కలిగింది.

బాగా పొద్దుపోయేదాకా ఆ రోజు రాత్రి నిద్దరే పట్టలేదు. అతను ఎప్పుడూ కాంతం వాళ్ళ యింట్లోనే వుంటే బాగుండును అని అనిపించింది. ఆ ఆశతోనే ఆ వారంలోనే కాంతం వాళ్ళ యింటికి మళ్ళీ యింకొక సారి వెళ్ళింది. అతగాడు కనిపించలేదు. 'ఏమయ్యాడు? ఎక్కడున్నాడు?' అని అడగటానికి తనకి ధైర్యం చాలలేదు. తన నిరాశా, నిస్పృహ కనిపెట్టినట్టుంది కాంతం.

"వేడి వేడి కాఫీ త్రాగు. మనస్సు చల్లబడుతుంది" అని నిజంలాంటి వేళాకోళాన్ని అన్నది. కాఫీ తాగింది కాని మనస్సులో ఆవేదనా, ఆరాటం ఏమాత్రము తగ్గలేదు, చల్లారలేదు.

" 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' అంటే నీకు నమ్మకం ఉందా?" అని కాంతం అడిగింది.

కమల ఏం మాట్లాడలేదు.

"నిన్నే" అని కాంతం మళ్ళీ అడిగింది.

"ఎవరినైనా ప్రేమిస్తున్నావా?" అని కమల అడిగింది.

"నాకూ, ప్రేమకూ ఆమడ దూరం."

"ఎప్పుడు కొలిచావ్?"

"చెప్పింది సరిగ్గా విను."

"అయితే సరిగ్గా చెప్పు."

"మా రామం అన్నయ్య వున్నాడా?"

"ఉన్నాడు."

"నిన్న గాక మొన్న యీ ఊరు పనిమీద వచ్చాడా? తన పనేదోతను చూసుకుని ఊరుకోకూడదూ? అబ్బే, అలా అయితే యింకేం. ఎవరో అందాలరాశిని చూశాడట. వెంటనే ప్రేమించేశాడట."

'అతను ఎవరినో ప్రేమించాడు.' కమలకు కళ్ళు చీకట్లు కమ్మాయి.

"ఎవరో 'లవంగి' ట. ఏ కులమో, ఏ జాతో" అంటూ కాంతం చెప్పుకు పోతోంది.

కమల ఒక్కసారి ఉలిక్కిపడి, "నిజం!" అని అడిగింది.

"ఆ అమ్మాయి నీకు తెలుసా!" అంటూ కాంతం ఎదురు సవాలు వేసింది.

కమల ఏం మాట్లాడలేదు.

"అన్నింటి కంటే ఆశ్చర్యం, నువ్వు మా యింటికి వచ్చిన రోజు నుంచే యీ విరహం."

"అంజిబావతో మా యింటికి వచ్చిన నాడే ప్రారంభమయిందేమో!"

కాంతం ఫక్కున నవ్వి, "దొరికింది దొంగ! మా అన్నయ్యతో ఏం చెప్ప మంటావు వదినా?" అని అడిగింది.

"ఈ తెలివి తక్కువ పనులు మానేయమని చెప్పు" అంటూ కమల అక్కణ్ణుంచి బయలుదేరి విసవిసా వచ్చేసింది.

వస్తుంటే నిలువెల్లా ఒకటే ఆవేదన, ఆరాటం. తను అన్న మాటలు కాంతం నిజంగా చెప్పేస్తుందేమోనని... విని అతను నిజమనుకుంటాడేమో!

ఈ ఆలోచనలో మునిగిన కమల తన యిల్లే దాటి వెళ్ళిపోయేదే! గుమ్మంలో నిలబడ్డ అంజిబావ పొలికేక పెట్టాడు. ఆ కేక విని ఉలిక్కిపడి ఆగింది. అంజిబావను చూసి చిరునవ్వు నవ్వింది. దాంతో ఆ పిచ్చివాడు ఏనుగెక్కినంత సంబరపడ్డాడు.

"ఏం బావా! గుమ్మంలో నిలబడ్డావ్?" అని అడిగింది.

"నువ్వు వస్తావని!"

కమల ఫక్కున నవ్వింది.

"నవ్వెందుకే..."

"మొగుడి కోసం ఎదురు చూసే భార్య ఫోజులో నువ్వు నిలబడితే నవ్వు వచ్చింది."

బావ సంబరంతో ఉబ్బితబ్బిబ్బై, "నీ కోసం ఎదురు చూడటం కన్నా నాకేం కావాలి?" అని అన్నాడు.

"ఎంత అల్ప సంతోషివి?" అన్నది కమల.

బావ ఒక చెంప తడిమి చూసుకున్నాడు.

"నొప్పి యింకా పోలేదా?" అని కమల అడిగింది.

బావ అక్కడనుంచి బయటకు పారిపోయాడు. మరుక్షణంలో వంటింట్లో ప్రత్యక్షమయ్యాడు.

"అత్తయ్యా! మనమంతా యివ్వాళ రాత్రి సినిమాకు వెళదాం" అని అమ్మతో అన్నాడు.

అమ్మ సరే అన్నది.

"కాంతాన్ని కూడా పిలవనా?" అని కమల అడిగింది.

బావ ఆముదం త్రాగిన ముఖం పెట్టి, 'సరే' అన్నాడు. సరాసరి హాలు దగ్గరకే వస్తానని కాంతం దగ్గరనుంచి సమాధానం వచ్చింది.

హాలు దగ్గర కాంతం వెంట బ్రహ్మచారి కనిపించాడు. అతన్ని చూడగానే కమలకు అంతులేని ఆనందం, భయం, సిగ్గూ, పారిపోదామన్న కోరికా వగైరాలు అన్నీ కలగాపులగంగా ఒక్కసారి కలిగాయి. తనను చూడగానే వాళ్ళు యిద్దరూ ఒక్కసారి 'హలో' అన్నారు. కాంతానికి తను బదులు పలికితే, అంజిబావ బ్రహ్మచారికి బదులు పలికాడు. అంతటితో ఊరుకోలేదు. బ్రహ్మచారిని శిష్టాచార ప్రకారంగా పరిచయం చేశాడు. "ఇతను నా ప్రియమిత్రుడు రామయ్య. ఈవిడ మా అత్తయ్య. ఆ సిగ్గుపడే అమ్మాయి మా అత్తయ్య ఏకైక పుత్రిక కమల."

తను సిగ్గుపడింది. అమ్మ చిరునవ్వు నవ్వింది. కాంతం తన దగ్గరగా వచ్చి, నెమ్మదిగా "నాకు థాంక్స్ చెప్పవేం" అని అడిగింది.

"అప్పుడేనా?" అని కమల అడిగింది.

"ఆశ చాలా వరకు ఉందే!"

"ఛా! పో!"

సినిమాలో అమ్మకు అటుప్రక్క తను, ఇటుప్రక్క బావ, అతని ప్రక్కన అతను, తనకు ఇటుప్రక్కన కాంతం, ఇదీ వరస. న్యూస్‌రీలు జరుగుతూ వుండగా కాంతం నెమ్మదిగా "పాపం!" అని అంటే "ఎందుకని?" అని కమల అడిగింది.

"ఎంతో దూరం."

"ఎవరికి?"

"నీకే!"

ముందుసీటులో కూర్చున్న ముసలాయన వెనక్కి తిరిగి చూశాడు కోపంగా. అమ్మాయిలు ఇద్దరూ గప్‌చిప్ సాంబారు బుడీ!!

అందరి దృష్టి వెండితెరమీద వుంది. కమలమ్మ దృష్టి మాత్రం అంజిబావ ప్రియ మిత్రుడిమీదనే. అతగాడి దృష్టి కూడా దాదాపు యీదిక్కే. ఇంకేముంది చిమ్మచీకటిలోనే పువ్వువిల్లుకాడు, వలపు మరులు గొల్పువాడు వల్లమాలిన అల్లరి సాగించి సందడి చేశాడు.

ఇంటర్వెల్‌లో కూల్‌డ్రింక్స్ యిస్తున్నప్పుడు ప్రయత్నంగానో, అప్రయత్నం గానో కమల చెయ్యి బ్రహ్మచారి చేతికి తగలడం, అంత చలిలో కూడా కమలకి చెమటలు పట్టి వళ్ళు వణికిపోవడం జరిగింది.

ఎందుకని? అని అంటే ఎందుకనో!

తియ్యని తలపులతో, అర్థంకాని ఆలోచనలతో నాలుగు రోజులు నాలుగు క్షణాలుగా గడిచిపోయాయి. కాంతం అత్తవారింటికి వెళ్ళిపోయింది.

బ్రహ్మచారి ఆనాటినుంచీ యీనాటివరకూ కనిపించలేదు. ఒకరోజున కాలేజీకి వెళుతూఉంటే ఎవరినో చూసి అతనే అని భ్రమసి మురిసిపోయింది. అంతలోనే క్రుంగిపోయింది. కాంతం అత్తవారింట్లో ఉంది. అంజిబావా వాళ్ళ ఊరు వెళ్ళిపోయాడు. మనసైనవాడు తన కంటపడేదెల్లా?

ఆనాటి నుంచీ నిత్యం పూజా, శనివారం ఒంటిపూట భోజనం, వెంకన్న గారికి పసుపు బట్టలతో కొండకు వస్తామని మొక్కుకోవటం- వగైరా జరిగినాయి.

నాన్నకి యీ విషయాలేవీ అర్థం కావు. దాళవాకి నీరు యిస్తారో లేదో, వ్యవసాయం అదనుకు ఎరువులు దొరుకుతాయో లేదో, కోతల వేళకు వాన వస్తుందేమో- యిదే బెంగ తప్ప తన కడుపున పుట్టిన ఆడకూతురు యిలా అల్లాడిపోతూందే, యీ పద్దెనిమిది సంవత్సరాలుగా మనస్సులో ఎన్నడూ మసలని

ఆలోచనలు, అనురాగాలు చిన్నదాని చిన్నారి మనస్సులో చెరుకు విలుకాడు అల్లరి చేస్తున్నాడని ఆయనకేం తెలుసు! తెలియదు. కనీసం తెలుసుకోవాలనే ధ్యాస కూడా లేదు. నాన్న దృష్టిలో మగవాడంటే అంజిబావ ఒక్కడే! వాడికి అమ్మాయిని యిచ్చేస్తే తన బాధ్యత తీరిపోతుంది.

అమ్మతో తన గోడు చెప్పుకుందామంటే ఎందుకనో గాని వల్లమాలిన బిడియం, చెప్పలేనంత సిగ్గు...

ఏం చెయ్యాలి? ఎల్లా బ్రతకాలి? అంటూ రెండు ఋతువులు కమల వాపోయింది. ఈ లోపల ఒక సంఘటన జరిగింది. నాన్న చిన్నబుచ్చుకున్నాడు. అమ్మ సంతోషించింది. తను ఏనుగెక్కినంత సంబరపడ్డది. పరుగెత్తుకుంటూ వెళ్ళి వెంకటేశ్వరస్వామి పటానికి నమస్కారం చేసింది. ఇంకొక అరఘడియలో ఆలయానికి వెళ్ళి పూజ చేయించింది. నూతన దంపతులని దేవుడు వెయ్యికాలాల పాటు చల్లగా చూడాలని మనస్సులో ఒకటికి పదిసార్లు మ్రొక్కుకుంది.

అసలు విషయం ఏమిటంటే సినిమా కథల్లోలాగా అంజిబావ మైసూరు రాష్ట్రంలో ఒక పల్లెటూరికి ఎక్స్‌కర్షన్‌గా ఇంకొక స్నేహితుడితో వెళ్ళాడు. వెళ్ళినవాడు వూరుకోకుండా తను ఉన్న యింటివారి అమ్మాయిని అమాంతం ప్రేమించాడు. ఆ అమ్మాయికూడా అంజిబావకు సరైన ఉజ్జీయే. సై అంటే సై అన్నదట.

'తస్సల రవల' యింకేముంది! శరదృతువు, చక్కటి వెన్నెల, మనోహరమైన ప్రకృతిలో చూపులు కలసిన శుభవేళ... పైన ఉండే పెద్దలు, దేవతలు కూడా 'శుభం' అన్నారు. వెంటనే గాంధర్వం, అనంతరం రాక్షసం పద్ధతుల మీద ఆ కన్నడ రాజ్యంలోనే వివాహపు తంతు ముగించిన వాడై, మద్రాసు వచ్చి రిజిస్ట్రారువారి దఫ్తరులో ఇంగ్లీషు చదువుకున్న పురోహితుని సమక్షంలో భూమి తనఖా దస్తావేజు, రిజిష్టరు చెయ్యడానికి వేచియున్న ఇద్దరు ప్రత్యర్థుల ప్రత్యక్ష సాక్ష్యంతో కుమారి అంబిక అంజిబావ అర్ధాంగి అయ్యిందట! గ్రిగరీపెక్ లాంటి ముఖం, గగ్గయ్య లాంటి కంఠస్వరం, సినిమాలో పద్మనాభం లాంటి బుద్ధులున్న ఎమ్.ఏ విద్యార్థి అంజిబావ అర్ధాంగిని గురించి తలుచుకుని కమల ఒక్క క్షణం జాలిపడ్డది.

జాలి పడుతూ ఈ విషాద గాథను పూసగుచ్చినట్టు కాంతానికి ఉత్తరం ద్వారా ఏకరువు పెట్టింది. కలం తాజాగా వెంటనే జవాబు రాయమని మరీమరీ హెచ్చరిక చేసింది. పక్షం తిరగకండానే కాంతం దగ్గరనుంచి నాన్న పేర ఉత్తరం వచ్చింది. నాన్న అమ్మకు మాత్రం చూపించాడు. మరునాడు ప్రయాణమై ఎక్కడికో వెళ్ళి వచ్చాడు. అమ్మతో నెమ్మదిగా ఏదో చెప్పాడు.

"బాగుంది" అని అంది.

మరునాడు సాయంకాలం యింటికి వచ్చేసరికి ఎవరో వృద్ధ దంపతులు నాన్నతో మాట్లాడుతున్నారు. కిటికీ దగ్గర ఎవరో కూర్చున్నారు. ఎవరు?

మనసును దోచి మనసున నిలిచిన బలే మొనగాడు.

తనని చూడగానే "డ్రస్ చేసుకో! పెళ్ళి వారు వచ్చారు" అని అంది అమ్మ.

మామూలు ధోరణిలో కసిరి కొట్టకుండా, నూతిలో పడి ఛస్తానని బెదిరించకుండా, ఆ ఎలనాగ, ఒక్కక్షణంలో స్నానం, రెండుక్షణాలలో మస్తైన ముస్తాబు ముగించుకుని అమ్మ ఎదుట నిలిచేసరికి అమ్మకు ఎంతో ఆనందం అంతకంటె ఎన్నో రెట్లు ఆశ్చర్యం కలిగి "వాళ్ళకు కాఫీ తీసుకుని వెళ్ళు" అని అమ్మాయితో అన్నది.

కాఫీ త్రాగుతున్నంత సేపూ ఆ చిన్నవాడి క్రీగంటి చూపులు చక్కనైప చిన్నదాని మీదనే.

అమ్మాయి అన్ని విధాల నచ్చిందని పెద్దవారు అన్నారు.

"పిల్లవాడు ఎల్లా ఉన్నాడని" అమ్మ కమలని అడిగింది.

కమల ఏం మాట్లాడలేదు. అమ్మని గట్టిగా కౌగలించుకుంది. అమ్మ విసుక్కోబోయి అంతలోనే సంబాళించుకుంది.

ఇంకేముంది! పక్షం తిరగకుండానే కమల పరాయివారి సొత్తు అయిపోయింది.

తన సర్వస్వం ఆ పరాయివానికిచ్చి వానిని తనవానిగా చేసుకునే మధురక్షణం స్మృతి పథంలో నిలిచి పోగల శాశ్వతఘడియ ఆసన్నమయింది. ద్వైతం అద్వైతమయ్యే స్థితికి చేరుకుంది.

"లవంగీ" అని మనోహరుడు పిలిచాడు.

చేరువయ్యే చిన్నది చెంతనే నిలిచినా అంతలోనే రవ్వంత భృకుటి ముడిచి కింద పెదవి ముని పంట నొక్కి బొటనవేలు నేలరాసి నవరసులు ముడికట్టిన బంగారు కొంగుముడిని వేలికి చుట్టి తెచ్చిపెట్టుకున్న క్రోధంతో.....

"ఎందుకు నన్ను లవంగీ అని పిలుస్తారు! నా పేరు కమల " అని కోపం లాంటి గోముతో అడిగింది.

"సంస్కృతం స్టూడెంటువి! ఆ మాత్రం తెలియదా?"

"చెప్పండి."

"లవ్‌లీ అంగములు కలది లవంగి."

కిలకిల నవ్వే చిన్నదాని నవ్వు క్రిందవారికి కూడా వినిపించింది.

ముద్దుపళని లాగా ప్రియుడిని హత్తుకుని పోయింది.

తరువాత?

ఏముంది? కధ కంచికి వెళ్ళింది.